

నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతిస్తూ అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించారు. తక్షణం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 8 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిన ఆరోగ్యశ్రీ 'ఆసరా'..!

సర్జరీ రోగులకు ఆర్థిక సాయం నిలుపుదల
గత ప్రభుత్వంలో రోజుకు రూ.225, నెలకు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం
1,625 రకాల సర్జరీలకు ఈ పథకం వర్తింపు
ప్రతినెలా రెండు జిల్లాల్లో 3 వేలకుపైగా సర్జరీలు
రోగులకు సాయం నిలుపుదలపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఆరోగ్యశ్రీలో వివిధ రకాల సర్జరీల ద్వారా చికిత్స పొందిన రోగులు కోలుకునే వరకూ అందించే ఆర్థిక సాయం 'ఆసరా'ను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఆరోగ్యశ్రీలో చికిత్స పొందిన రోగులకు ఎటువంటి ఆర్థిక చేయూత లేకుండాపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో కొన్ని మార్పులు చేసింది. ఆరోగ్యశ్రీలో సర్జరీలు చేయించుకున్న రోగులు కోలుకునే వరకూ రోజుకు రూ.225, కనీసంగా నెలకు రూ.ఐదు వేలు చొప్పున ఆర్థిక సాయం చేసే ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇది ఎంతోమంది రోగులకు ఉపయోగంగా ఉండేది. సర్జరీ తర్వాత ఏ పనీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులకు ఈ సొమ్ము మందులకు, ఇతర అవసరాలకు




ఉపయోగపడేది. ఈ ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకం పేరును మార్పు చేసి ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ పేరుతో అమలు చేస్తోంది. ఇక్కడ వరకూ ఎవరికీ పెద్దగా ఇబ్బంది లేదు. రోగులకు ఎంతగానో ఉపయోగపడే 'ఆసరా' పథకం నిలుపుదలపై మాత్రం తీవ్ర విమర్శలు విన్పిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ ఆసరా పథకంలో 1,625 రోగాలకు సంబంధించిన సర్జరీలు చేయించుకున్న రోగులకు రోజుకు రూ.225 చొప్పున ప్రభుత్వం అందించేది. ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లేలోగా ఈ సొమ్ము రోగుల ఖాతాల్లో జమయ్యేది. ఈ పథకం నిలుపుదలతో రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జిల్లాలో నెలకు సరాసరిన ఐదు వేల మంది వరకూ ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లో ఆర్యోగశ్రీ సేవలు పొందుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకూ 'ఆసరా' పథకం పరిధిలోకి వచ్చే సర్జరీలు 2,105 వరకూ జరిగాయి.

ఆర్యోగ్యశ్రీ 'ఆసరా' పథకం కింద రూ.కోటీ 14 లక్షలు వరకూ ఆర్థికసాయం రోగులకు అందింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ 'ఆసరా' పథకం పరిధిలోకి వచ్చే సర్జరీలు 19,019 వరకూ ఉన్నాయి. సర్జరీ జరిగిన రోగులకు ఆసరా కింద అందిన సాయం రూ.10.52 కోట్లు. ఆసరా ద్వారా అందిన సొమ్ము రోగులకు ఎంతగానో ఉపయోగపడేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండాపోయింది.

అక్టోబర్ నుంచి 'ఆసరా' నిలుపుదల..


ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఆరోగ్యశ్రీ ఆసరా పథకం నిలిచిపోయింది. దీంతో రోగులకు ఆర్థిక సాయం అందడం లేదు. గత లెక్కలను బట్టి పరిశీలిస్తే ఈ పథకం నిలిచిన ఈ మూడు నెలల్లో దాదాపు తొమ్మిది వేల మంది రోగులకు ఆర్థిక సాయం అందకుండాపోయిందని చెప్పొచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యం అత్యంత ఖరీదైందిగా మారిపోయింది. జ్వరం వచ్చిందని ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లినా కనీసం రూ.30 వేల నుంచి రూ.50 వేలు పిండేస్తున్నారు. ప్రసవాలకైతే రూ.లక్ష వరకూ గుంజుతున్నారు. దీంతో సామాన్య ప్రజానీకం ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లోనే వైద్యం చేయించుకుంటున్నారు. ఈ పథకంలో చికిత్స పొందేవారంతా నిరుపేదలే. ధనవంతులు ఎవరూ ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకునే పరిస్థితి లేదు. పేద కుటుంబాలకు అండగా ఉండే ఆరోగ్యశ్రీ ఆసరాను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయడం దారుణంగా చెప్పొచ్చు. సర్జరీ చేయించుకున్న తర్వాత రోగి కోలుకోవడానికి నెలల సమయం పడుతోంది. అప్పటి వరకూ చిల్లిగవ్వ ఆదాయం ఉండదు. అటువంటి వారికి ఆసరా ద్వారా అందించే సొమ్ము ఎంతో ఊరటనిస్తోంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా దీనిపై పునరాలోచించి ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లో సర్జరీలు చేయించుకునే రోగులకు ఆసరా పథకం వర్తింపజేయాలని అంతా కోరుతున్నారు.



భీమవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నేతలు

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలంటూ వామపక్షాలు జిల్లాలో పెద్దఎత్తున సోమవారం నిరసనలు చేపట్టాయి. భీమవరంలో సిఐటియు కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, కె.భీమారావు మాట్లాడారు. తాడేపల్లిగూడెంలో పోలీసు ఐల్యాండ్ వద్ద, తణుకు నరేంద్ర సెంటర్‌లో, నరసాపురం అంబేద్కర్ సెంటర్లో, ఆచంట, ఇరగవరం, వీరవాసరం, పాలకొల్లు తదితర కేంద్రాల్లో నిరసనలు చేపట్టి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, లేకుంటే ప్రధాని మోడీ అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని నినదించారు.



వార్త 6లో..

ఆచంటలో నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

ప్రతి వినతినీ పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశకి - భీమవరం

ఆర్థిక పరమైన, కోర్టు కేసులకు సంబంధించిన వినతులకు తప్ప మిగిలిన అన్ని వినతులకూ సరైన పరిష్కారాన్ని చూపాలని, ప్రతి వినతికీ నాణ్యమైన సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పిజిఆర్‌ఎస్ వినతులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ప్రతి వినతినీ కూలంకుషంగా పరిశీలిస్తోందని, వినతుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేసారు. వినతుల స్వీకరణ అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ వినతులకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యతనిస్తుందో అధికారులు గుర్తించాలన్నారు. పని జరిగిన తర్వాతే అర్జీని డిస్పోజ్ చేయాలని, తప్పుడు ఎండార్స్‌మెంట్ వేసినా, తప్పుడు ఫోన్ నెంబర్లను ఇచ్చినా, సంబంధం లేని సమాధానాలు ఇచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో అర్జీల పరిష్కారం తీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రీఓపెన్ కేసుల విషయంలో రీఓపెన్ కావడానికి గల కారణాలను రాయాలని తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 149 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

జిల్లా కేంద్రం భీమవరంలోనే కొనసాగాలి

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభజన తర్వాత భీమవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన విభజిత పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉందని, జిల్లా కేంద్రాన్ని వేరే ప్రాంతానికి తరలించడం సరికాదని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 ఏప్రిల్ 22న జిల్లా ఏర్పడిన తర్వాత 2023 మార్చి 20న జిఒఎంఎస్ 124 ద్వారా గునుపూడిలోని 15 ఎకరాల భూమిలో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌తో కలెక్టరేట్ నిర్మాణం చేయాలని నిర్ణయించినట్లు మోషేన్ రాజు తెలిపారు. అయితే ప్రస్తుతం కాళ్ల మండలంలో కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి అధికారులు సర్వే చేశారనే వార్తలు ప్రజలను అయోమయానికి, గందరగోళానికి గురి చేస్తున్నాయన్నారు. దీనిపై కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు ఒక స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భీమవరంలోనే కలెక్టరేట్ ఉండాలని మోషేన్‌రాజు స్పష్టం చేశారు. లేదంటే జిల్లా కేంద్రాన్ని కాపాడుకోవడానికి భీమవరం నియోజకవర్గ ప్రజలు అన్ని ప్రయత్నాలు చేస్తారన్నారు.

సిఐ శాంతిలాల్‌ను అరెస్టు చేయాలి

తణుకులో న్యాయవాదులు నిరసన

ప్రజాశక్తి - తణుకు

అనంతపురం త్రిటౌన్ సిఐ శాంతిలాల్‌ను అరెస్టు చేయాలని తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) డిమాండ్ చేశారు. సోమవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి, న్యాయవాది శేషాద్రి మృతికి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ అనంతపురంలో త్రిటౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ శాంతిలాల్ సివిల్ కేసులో న్యాయవాది బివి శేషాద్రిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అతనిని అవమానకరంగా మాట్లాడి, దౌర్జన్యం చేశారన్నారు. ఆ అవమానాన్ని భరించలేక చనిపోయారని తెలిపారు. దీనికి కారణం సిఐ శాంతిలాల్, అతని సిబ్బంది కారణమన్నారు. దేశంలో, రాష్ట్రంలో న్యాయవాదులపై అనేక దాడులు జరుగుతున్నాయని, అందుకు న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం సమగ్రమైన చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామకృష్ణ, కౌరు వెంకటేశ్వర్లు, కలిదిండి పద్మావతి, బి.విక్టర్‌బాబు, చోడే గోపీకృష్ణ, న్యాయవాది గుమస్తాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, ఆర్.సురేష్‌బాబు, కామన మునిస్వామి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కంటి చెమ్మ ఆరేనా..!

అభివృద్ధిలో అద్భుతాలు సృష్టిస్తున్నాం.. సంప్రదాయాల్లో మనమే ఆదర్శం.. ప్రగతిలో పరుగులు పెడుతున్నాం.. అని గొప్పలు చెప్పుకుంటున్నాం.. అయితే ప్రేమోన్మాదం పెచ్చురిల్లుతోంది.. మానవ మృగం మగువల జీవితాలను చిదిమేస్తోంది.. ముక్కుపచ్చలారని పసిమొగ్గలపై పైశాచికత్వం చూపుతోంది. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లయినా మహిళలకు రక్షణ లేదు.. జీవితాల్లో మార్పు లేదు.. కంటి చెమ్మ ఆరలేదు.. నిర్భయ, పోక్సో చట్టాలున్నా కీచకుల ఆగడాలు ఆగడం లేదు.. ఏటా అత్యాచారాలు, వరకట్న వేధింపులు, హత్యలు పెరుగుతున్నాయి.. ఇలాంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో ఎన్నో..

- డెస్కు

ఏలూరు
అశోక్‌నగర్‌లో గుండెలు పిండేసే ఘటన జరిగింది. స్థానికంగా ఓ మిషనరీ వసతిగృహంలో ఉంటూ ఇంటర్ చదువుతున్న బాలిక గర్భం దాల్చింది. తొమ్మిది నెలల తరువాత ఆమె ప్రసవించిన బిడ్డను వసతి గృహం పైనుంచి విసిరి ఉసురుతీశారు. పక్కనున్న అపార్టుమెంట్‌కు సంబంధించిన వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు.

ప్రేమ పేరుతో ఓ ఉన్మాది సత్రంపాడుకు చెందిన యువతి రత్నాగ్రేస్(23)ను కడతేర్చిన ఘటనతో జిల్లావాసులు ఉలిక్కిపడ్డారు. ముసునూరుకు చెందిన యువకుడు ఏసురత్నం ఆమెను ప్రేమ పేరుతో వేధించాడు. తనకు పెళ్లి కుదిరిందని చెప్పినా వినలేదు. తనను పెళ్లి చేసుకోకుంటే చంపేస్తానంటూ బెదిరించాడు. ఒప్పుకోలేదని కత్తితో పాశవికంగా నరికి చంపాడు. అక్కడితో ఆగకుండా తన గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

- **పెదవేగి మండలం నుంచి ఏలూరు వచ్చి హోటల్‌లో పని చేసుకుంటూ రాత్రివేళల్లో ఆరుబయటే నిద్రిస్తున్న మహిళపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడటం తీవ్ర సంచలనం సృష్టించింది.**
- **ఏలూరులో ఓ ప్రయివేటు వసతి గృహంలో ఉన్న విద్యార్థినులను బయటికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వార్డెన్ భర్త నిర్వాకం వెలుగుచూడటంతో అంతా నివ్వెరపోయారు.**
- **నూజివీడు మండలంలో ఆరుబయట నిద్రిస్తున్న చిన్నారిని అక్కడకు లోడు దింపేందుకు వచ్చిన లారీ క్లీనర్ సమీప తోటల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు**

వదలట్లేదు..! ★★★

ప్రభుత్వ మొదలుకుని ప్రయివేటు సంస్థల వరకూ పని ప్రదేశాల్లో మహిళలకు లైంగిక వేధింపులు సర్వసాధారణంగా మారాయి. చెప్పినట్లు చేయకుంటే ఉద్యోగ భవిష్యత్ ఉండదన్న బెదిరింపులూ మామూలే. వీటిఇ తిరస్కరించినా తమను ప్రత్యేక వ్యక్తులుగాచూడడానికి అంగీకరించకపోయినా తీవ్ర పరిణామాలు తప్పవని ఒత్తిళ్లూ ఉంటాయి. విద్యార్థులనైతే అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ చేస్తామంటారు. అలాంటి వారికి భయపడి జీవితాన్ని చీకటి చేసుకుంటున్నారు చాలా మంది. బాధితులు మౌనంగా ఉండడాన్ని అలుసుగా తీసుకుని కీచకులు రెచ్చిపోతున్నారు.

కంటిపాపలను కనిపెట్టుకుని ఉండండి.. ★★★

ముద్దు చేసినట్లుగా దగ్గరకు చేరదీస్తారు. ఆ ముసుగులో ఎక్కడెక్కడో తాకుతారు. ఒళ్లంతా తడుముతారు. ఇంట్లో, పక్కింట్లో, ఎదురింట్లో పరిసరాల్లో చివరికి బడిలో ఇలా ఎక్కడైనా సరే ఇలాంటి కీచకులు పొంచి ఉండోచ్చు. పిల్లలను చూసుకునే తీరిక లేకో, ఇతర కారణాల వల్లో చాలా మంది

పనిచేసే చోటా..

తెలిసిన వారికి, బంధువులకు తమ పిల్లలను అప్పగిస్తుం టారు. కొందరు మృగాళ్లు వారితో అనుచితంగా ప్రవర్తిస్తారు. అలాంటి వారి అకృత్యాల బారిన చిన్నారులు పడకుండా ఉండాలంటే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.






మార్ఫింగ్‌లు.. డీప్ ఫేక్‌లు..! ★★★

అంతర్జాలం మాటున నక్కిన తోడేళ్ల దాడులకు ఎందరో యువతులు, మహిళలు బలైపోతున్నారు. సైబర్ వేధింపులు, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు, వెబ్‌క్యామ్ హ్యాకింగ్‌లు, అభ్యంతరకర పోస్టులు, మెసెజ్‌లు ఇలా అనేక రూపాల్లో దాడులు చేస్తున్నారు. ఇలాంటి మోసాలు, నేరాలపై మహిళలు జాగ్రత్తంగా ఉండాలి.

మైనర్లపై అఘాయిత్యాలు..

మహిళలపై కొనసాగుతున్న వేధింపులు

చట్టాలు కాగితాలకే పరిమితం



మహిళల భద్రతకు అభయ రక్షక దళం.. ★★★

జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్



మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహిళల రక్షణ, వారి భద్రత కోసం అభయ రక్షక దళాన్ని జిల్లాలో ఏర్పాటు చేసి నిరంతరం వారికి అండగా ఉండేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాం. మహిళలు, యువతులు, విద్యార్థునుల భద్రత కోసం వీరు నిరంతరం కృషి చేస్తున్నారు. ఏలూరు నగరంలో జిల్లాలోని ఎన్నడూ లేనివిధంగా కళాశాలలు వదిలే సమయాల్లో మహిళా రక్షక దళం ప్రతిరోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తోంది. వారు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, జన సాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, పబ్లిక్ పార్కుల్లో తదితర ప్రాంతాల్లో ప్రతిరోజూ అవగాహన కల్పిస్తూ ఆకతాయిల ఆటకట్టిస్తున్నారు. ఆపదలో ఉన్న వారు 112 నంబర్‌కు సమాచారం ఇస్తే క్షణాల్లో మహిళా రక్షక దళం అక్కడికి చేరుకుని వారికి సహాయ సహకారాలు అందిస్తుస్తోంది. ఇప్పటికే మహిళల భద్రత కోసం ప్రత్యేక ఫోన్ నంబర్ ఏర్పాటు చేశాం. ప్రతిరోజూ ఆరు నుండి ఏడు ఫిర్యాదులు వాట్సప్ నంబర్‌కు అందుతున్నాయి. ఇప్పటివరకూ 180 ఫిర్యాదులను నేనే స్వయంగా వాట్సప్ ద్వారా పరిశీలించాను. వెంటనే పరిష్కరించాం.

తల్లిదండ్రులు పిల్లలను గమనించాలి.. ★★★

ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి,నరసాపురం



చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలకు ఇంటికి వచ్చిన తర్వాత ఫోన్లతో ఏం చేస్తున్నారో, ఎవరితో స్నేహం చేస్తున్నారో గమనించాలి. తల్లిదండ్రులు పిల్లలతో ప్రేమగా ఉండాలి. విద్యార్థులు, యువతులు వీలైనంత వరకూ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. తెలియని వారితో సోషల్ మీడియాలో మీ వ్యక్తిగత విషయాలు పంచుకోవద్దు. ఏమైనా వేధింపులు ఎదురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. ప్రేమ పేరుతో మోసపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులలో చైతన్య పరుస్తున్నాం. ఏదైనా ఆపద వస్తే అత్యవసర సమయంలో 100, 112 నంబర్లకు సమాచారం అందించాలి.

ఆత్మ రక్షణకు ఇలా ఆలంబన..

మహిళలు, యువతులపై ఆగంతులకుల నుంచి దాడుల ముప్పు పొంచి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో వెను వెంటనే స్పందించేందుకు వీలుగా ఈ ఆత్మరక్షణ విధానాలు తెలుసుకోవాలి. శరీరంతోపాటు మానసికంగా కూడా దృఢంగా ఉండాలి. కరాటే వంటివి నేర్చుకోవాలి. కోచింగ్ సెంటర్లకు వెళ్లే వీలు లేని పక్షంలో అంతర్జాలంలో అనేక వీడియోలు అందుబాటులో ఉన్నాయి. మీ కుటుంబ సాయం తీసుకుని వాటిని నేర్చుకోవాలి. ఆగంతకులు దగ్గకు వచ్చి దాడి చేయడానికి ప్రయత్నిస్తే చుట్టూ ఉన్న వారికి వినపడేలా బిగ్గరగా అరవాలి. అయినా పరిస్థితి చేయిదాటిపోతుంటే వచ్చిన వ్యక్తి కళ్లు, గొంతు మోకాళ్లు, సున్నిత భాగాలే లక్ష్యంగా దాడి చేయాలి.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు



తాడేపల్లిగూడెంలో సిపిఎం నేతల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, కె.భీమారావు మాట్లాడుతూ పార్లమెంటులో రాజ్యాంగంపై చర్చ సందర్భంలో అంబేద్కర్ నామస్మరణకన్నా భగవాన్ నామస్మరణ చేసి ఉంటే బాగుంటుందని అమిత్‌షా మాట్లాడటం అంబేద్కర్‌ను కించపర్చడమేనన్నారు. లౌకిక రాజ్యాంగంలో మతం వ్యక్తిగతమని, దానిని పరిపాలనకు వాడుకోవడం సరైనది కాదని అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి మంత్రి పదవిలో కొనసాగుతూ రాజ్యాంగ విరుద్ధమైన మాటలు మాట్లాడిన అమిత్‌షా హోం మంత్రి పదవికి అనర్హుడని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షత వహించగా సిపిఐ నాయకులు చెల్లబోయిన రంగారావు, మల్లుల సీతారాం ప్రసాద్, ఆనంద్, సిపిఎం నాయకులు మామిడిశెట్టి రామాంజనేయులు, కె.క్రాంతిబాబు, ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఇంజేటి శ్రీనివాస్, దేగల నాగేశ్వరరావు, బత్తుల విజయ్‌కుమార్, త్రిమూర్తులు, గోపాలకృష్ణంరాజు, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు బాబూరావు, దళిత సంఘాల నాయకులు జోసెఫ్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: అమిత్‌షా వెంటనే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యాన సోమవారం స్థానిక పోలీసు ఐల్యాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాబూరావు, నాగేశ్వరరావు మాట్లాడుతూ అంబేద్కర్ పట్ల అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రధాని మోడీ ఖండించకపోవడం సిగ్గుచేటన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ జెండాను, లౌకికవాదాన్ని అవమానపర్చేలా బిజెపి పరిపాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్, ప్రజాసంఘాల నేతలు మెరిపే జాన్‌రాజు, దాస్యం రాము, జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మెట్రెడ్డి రమణ, కన్నంరెడ్డి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

తణుకు: అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిపిఐ, సిపిఎం, పలు



తణుకులో..

సామాజిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు, ప్రతాప్ మాట్లాడుతూ అమిత్‌షా వెంటనే తన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు పులపర్తి సత్యనారాయణ, బండి సత్యనారాయణ, పుట్టా అమ్మిరాజు, గార రంగారావు, ఉందుర్తి ప్రసన్నకుమార్, ఆనందం వెంకటేశ్వరరావు, కామన మునిస్వామి, దేగల హనుమంతరావు, గుబ్బల గోపి, వల్లూరి వెంకటేశ్వరరావు, బళ్ల చినవీరభద్రరావు పాల్గొన్నారు.

ఇరగవరం: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కామన మునిస్వామి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తామరపల్లి ముసలయ్య, జుత్తిగ రామాంజనేయులు, గుబ్బల ముత్యాలరావు, జక్కంశెట్టి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం: అమిత్‌షా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని సిపిఎం ఆధ్వర్యాన స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ



నరసాపురంలో..

సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ అంబేద్కర్‌ను కించపరుస్తూ మాట్లాడిన అమిత్‌షా మంత్రి పదవికి అనర్హుడని, తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు నోముల కొండ, కోరాడ బద్రి, గుత్తుల శ్రీరామచంద్రుడు, కైలా సత్తిబాబు, పొన్నాడ మల్లేష్, కె.నరేష్, సిర్రా నానిబాబు పాల్గొన్నారు.

ఆచంట: అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పెదపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు మాట్లాడగా నాయకులు బండి రంగారావు, తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, సిర్రా నరసింహమూర్తి, వర్ధనపు కృష్ణమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వీరవాసరం: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సోమవారం స్థానిక జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, మండల కార్యదర్శి బొర్ర నల్లమహారాజు, నాయకులు బాలం విజయ్‌కుమార్, సుబ్బారావు, శ్యాంబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు: కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ మనుధర్మాన్ని ముందుకు తెచ్చేందుకు రాజ్యాంగాన్ని నష్టపర్చేలా మాట్లాడుతున్నారన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాస్, నేతలు తిరుమాని శ్రీనివాస్, వై.అజయ్‌కుమార్, ఎస్.పురుషోత్తం, గుబ్బల సత్యనారాయణ, టి.సూర్యారావు, రంది కృష్ణ, ఎం.లక్ష్మీనారాయణ, రాము, వేగి రత్తయ్య, జి.వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ప్రక్షాళన

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలోని శ్మశానవాటికను సోమవారం పంచాయతీ పాలకవర్గ సభ్యులు ప్రక్షాళన చేశారు. గ్రామంలోని కొరువారి పుంతలో ఉన్న శ్మశానవాటికలో పేరుకుపోయిన ముళ్లపొదలను, చెత్తా చెదారాలను, రహదారికి ఇరువైపులా ఉన్న మొక్కలను యంత్రాలతో తొలగించారు. శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వారి ఇబ్బందులు తొలగించేందుకే శుభ్రం చేయించామని సర్పంచి అడ్డాల సూరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కర్రి వీరాస్వామి, బొల్లా శ్రీనివాసు కార్యదర్శి ఎం.సత్యనారాయణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారంపై దృష్టి

ప్రజాశక్తి - కాళ్ల

రెవెన్యూ శాఖకు చెందిన సమస్యల శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తహశీల్దార్ జి.సుందర్‌సింగ్ తెలిపారు. మండలంలోని జక్కరంలో రెవెన్యూ సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దార్ జి.సుందర్‌సింగ్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చుట్టూ తిరగడం కాకుండా ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ పరమైన సమస్యలను దశల వారీగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్ఓ గనిశెట్టి సుధాకర్, సర్వేయర్లు వీఆర్ఏలు పాల్గొన్నారు.



రత్తయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంతెన వెంకట రవివర్మ

మృతుల కుటుంబాలకు వెంకట రవివర్మ పరామర్శ

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పడమట రత్తయ్య, ఆర్యవైశ్య మండల అధ్యక్షులు కసగర్ల గాంధీ కుటుంబాలను రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ సోమవారం పరామర్శించారు. రత్తయ్య, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోకరాజు రామరాజు, గోకరాజు రంగరాజు, టిడిపి నాయకులు పడమట వెంకట పద్రాజు, మాజీ ఎంపిటిసి పడమట సత్యనారాయణ, కసగర్ల వెంకటేశ్వరరావు, కసగర్ల సిద్దార్థ, కసగర్ల సాయి వినీత్, ఉపాధ్యాయుడు కట్టా వెంకటేశ్వరరావు, తలగడ బ్రహ్మం పరామర్శించిన వారిలో ఉన్నారు.

దళితనేత మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు, వెలగలేరు, నెగ్గిపూడి, సత్యవరం, వనంపల్లి పంచ గ్రామాల దళిత నాయకుడు, మాజీ రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సోడగిరి నాగేశ్వరరావు మృతికి పలువురు సంతాపం తెలిపారు. మార్టేరు పెదపేటలోని ఆయన నివాసంలో చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్టేరు సర్పంచి మట్టా కుమారిరాము, నెగ్గిపూడి మాజీ సర్పంచి, టిడిపి నాయకులు కర్రి అచ్చుత రామారెడ్డి, ఆలమూరు మాజీ సర్పంచి వసంతాడ నాగేశ్వరరావు, దళిత నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కందరవల్లిలో ఆరు గడ్డిమేట్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆచంట

కరుగోరుమిల్లి గ్రామ ప్రభలు తీర్థపుంతలో ఆరు గడ్డిమేట్లు ఆదివారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు 32 ఎకరాలపైనే గడ్డివాములు తగలబడిపోయి రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. పశువుల కోసం మేట్లుగా వేసి నిల్వ ఉంచిన గడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు తగలపెట్టడంపై రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకొల్లు నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపుచేసింది. గడ్డి మాత్రం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. దీని విలువ సుమారు రూ.5 లక్షలపైనే ఉంటుందని అధికారులు అంచనావేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక రైతులు దొమ్మేటి సత్యనారాయణ, చింతపల్లి నాగరాజు, కొప్పుశెట్టి వరప్రసాద్, బొర్రా సూర్యనారాయణ, దొమ్మేటి వీరస్వామికి చెందిన గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ తరహాలో రైతులు అనుమానాస్పదం వ్యక్తంచేస్తూ ఆచంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వంట సామగ్రి, కుర్చీలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలోని తోకతిప్ప గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అవసరమైన కుర్చీలు, బల్లలు, భోజనం ప్లేట్లు, గ్లాసులతో పాటు వంట సామగ్రిని గ్రామానికి చెందిన తిరుమాని ఉమామహేశ్వరరావు సోమవారం గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సమాజ సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. రామన్న రోజుల్లో గ్రామానికి మరిన్ని సేవలందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కె.మల్లేశ్వరి, పి.విజయ కుమారి పాల్గొన్నారు.

సరిపల్లి, లిఖితపూడిలో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సరిపల్లి, లిఖితపూడి గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలు, ఆన్‌లైన్ ఇబ్బందులు, పట్టాదారి పాస్ పుస్తకం తదితర సమస్యలు ఉంటే ఈ సదస్సుల్లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఈదా సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి శ్రీవారి కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో జనవరి 4 నుంచి 6వ తేదీ వరకూ 3 రోజులపాటు స్వామివార్ల కళ్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. పాలకొల్లులోని మేడికొండ శ్రీనివాస్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో నిర్వాహకులు గురు స్వామి యాదంరెడ్డి సత్యం, కెవి కష్ణ వర్మ, బీరక ప్రసాద్, కుంపటి నాగ శ్రీనివాసరావు, కాటంరెడ్డి సత్యనారాయణ, గాదంశెట్టి సతీష్, టంగుటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. 4న అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవ విగ్రహాలతో మంత్రి రామానాయుడు దంపతులచే కళ్యాణోత్సవం జరుగుతుందన్నారు. యాత్రికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

మాధవనాయుడుకు తహశీల్దార్ పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తండ్రి బండారు ప్రతాప్ నాయుడు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం మాధవనాయుడును సరిపల్లిలో ఆయన నివాసంలో నరసాపురం తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి పరామర్శించారు. ముందుగా ప్రతాప్ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్ఐ లక్ష్మీనారాయణ, పులపర్తి శ్రీధర్, కొండేటి శ్రీను, నడిపూడి కృష్ణ పాల్గొన్నారు.



ప్రతాప్‌నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహశీల్దార్, నేతలు



నరసాపురం : వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డిఒ దాసిరాజు అధికారులను ఆదేశించారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 34 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఒక ఫిర్యాదు అందినట్లు తహశీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. శేరేపాలెం గ్రామానికి చెందిన కత్తుల సత్యనారాయణ తన స్థలాన్ని సర్వే చేసి న్యాయం చేయాలని కోరుతూ వినతి అందించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ త్రిశూల పాణి, పిఆర్ ఎఇఇ వెంకటేశ్వరరావు, ఎఒ రహీమ్, ఎంఇఒ శామ్యూల్ జాన్, మండల సర్వేయర్ ధనరాజ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 31న మధ్యాహ్నం 12 గంటలకు కౌన్సిల్ హాల్లో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి సకాలంలో కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపాలిటీలో పారిశుధ్య పనులపై కార్మి కులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని 2, 6వ వార్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించి, ప్రజారోగ్య విభాగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర వేంద్ర ప్రసాద్, పాత్రుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'తప్పుల తడకగా పరీక్షా పేపరు'

ప్రజాశక్తి - ఆకివీడు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో భాగంగా తెలుగు పరీక్షా పేపరు తప్పులతో ఇచ్చారని విద్యార్థులు వాపోయారు. పరీక్ష పేపర్ మొత్తం 70 మార్కులకు గాను రెండు భాగాలుగా ఇస్తారు. వాటిలో మొదటి భాగంలో 8 సెక్షన్లలో ఐదు సెక్షన్లకు సమాధానం రాయాలి. వాటిలో రెండో ప్రశ్న పద్యం పూరించాలి. ఆ పద్యానికి మొదటి పాదంలో రెండు పదాలు నాలుగో పాదంలో చివరి రెండు పదాలు ఇస్తారు. మిగిలినది విద్యార్థులు పూరించాలి. అయితే ఇక్కడ పూరించాల్సిన పద్యం రెండో విభాగంలో పూర్తిగా పద్యంగా ఇచ్చారు. అది చూసి ఇక్కడ రాస్తే పూర్తిగా 4 మార్కులు ఇవ్వాలి. ఇక రెండవది మొదటి సెక్షన్‌లో నమూనా పేపర్లో 8 సెక్షన్ ఇచ్చి వాటిలో ఐదు సెక్షన్లు రాయమన్నారు. అయితే ఇందులో పది సెక్షన్లు ఇవ్వాలని కొందరు విద్యార్థులు అంటున్నారు. అధ్యాపకులు కూడా కొందరు పది సెక్షన్ల అని చెబుతున్నారు. దీంతో రెండు చిన్న ప్రశ్నలు తగ్గినట్లు అయిందని విద్యార్థులు వాపోయారు.

రోగులతో ప్రేమగా మెలగాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఆసుపత్రికి వచ్చే రోగులు పట్ల ప్రేమగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం ప్రభుత్వాస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అస్పత్రిలో శుభ్రతను పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమావేశమయ్యారు. ఆస్పత్రికి కావాల్సిన సదుపాయాలను త్వరలో సమకూర్చుతానని నాయకర్ హామీ ఇచ్చారు. సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.సుప్రియ, జెట్టి గణేష్, రామకృష్ణ, నాయకులు బందేల రవీంద్ర, వలవల నాని పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ అని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని సత్యవరం, ఆలమూరు, భట్లమగుటూరు, గరువు గ్రామాల్లో ప్రభుత్వం అందించే రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు తదితర అర్జీలను లబ్ధిదారుల నుంచి స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో గుంతలు కూడా పూడికచేయలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య పాలన సాగుతోందన్నారు. పార్టీలతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గూడూరి మురళి, సర్పంచి మేడపు రెడ్డి వెంకటరమణ, బయ్య సుగుణమ్మ, ఎంపిటిసి పలివెల ఆశాజ్యోతి పాల్గొన్నారు.

నరసాపురం ర్యాలీ

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని చలవపేటలో సోమవారం క్రిస్మస్‌ను పురస్కరించుకుని చిల్డ్రన్స్ యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ దండోరా ర్యాలీ నిర్వహించారు. చలవపేట నుంచి పొన్నపల్లి, శ్రీహరిపేట, భూపతివారి వీధుల గుండా క్రిస్మస్ పాటలు పాడారు. చిన్నారులు క్రిస్మస్ తాత వేషధారణలు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బత్తుల రాహుల్, క్రాంతి, దాసు, బుంగ పండు, రవి, శ్రీకాంత్, బూన్, బ్లెసి పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు దానం

ఉండి: నిరుపేదలకు పండుగ సమయంలో వస్త్ర దానం, అన్నదానం కొన్ని సంవత్సరాలుగా చేయడం తమకు ఆనవాయితీగా మారిందని పెదపుల్లేరు గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు దంపతులు అన్నారు. సోమవారం గ్రామంలోని సుమారు 200 మంది నిరుపేదలకు దుస్తులు అందజేసి, అన్నదానం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతినెలా కొంతమంది నిరుపేదలకు బియ్యం, నగదు రూపంలో సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

తణుకులో వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - తణుకు

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు (ఎకెటిపి) స్కూల్లో పాఠశాల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనను తణుకు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి డి.మురళీకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు వైజ్ఞానికంగా పాల్గొనడం వల్ల మేధోశక్తి విస్తృతమౌతుందని తెలిపారు. అనంతరం విద్యార్థుల సైన్సు ప్రయోగాలను తిలకించారు. విద్యార్థులు 50 ప్రాజెక్టులను తయారు చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాళ్లబత్తుల రామకృష్ణ, మంగతాయారు, పి.శ్రీదేవి, ఎస్‌కె రజియా, సునీత, విజయలక్ష్మి, వివిఎల్ఆర్‌కె కుమార్ పాల్గొన్నారు.



ప్రయోగాలను పరిశీలిస్తున్న మురళీకృష్ణ

శుద్ధి జలాలను అందించండి

ప్రజాశక్తి - ఆకివీడు

నగర పంచాయతీ పరిధిలోని పలు మంచినీటి చెరువుల వద్ద ఉన్న ఒహెచ్ఎస్ఆర్‌లకు అవసరమైన ఫిల్టర్ బెడ్లు లేవని వాటిని మార్చి శుభ్రమైన తాగునీటిని ప్రజలకు అందించాలని నగర పంచాయతీ పాలకవర్గ సభ్యులు నిమ్మల నాగేశ్వరరావు కోరారు. సోమవారం పాలకవర్గ సమావేశం ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన నగర పంచాయతీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు నాగేశ్వరరావు పలు సమస్యలను ప్రస్తావించారు. నగర ప్రజలు వాలంటీర్లు ఉన్నారనే అనుకుంటున్నారని, ప్రభుత్వ విధానం దానికి అవకాశం కల్పిస్తోందన్నారు. అధికారులు నిర్వహిస్తున్న పలు సర్వేలు వాలంటీర్ల సర్వీస్ నంబర్లతోనే జరుగుతున్నాయన్నారు. నగర పంచాయతీ పరిధిలో గృహ నిర్మాణాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న అనేకమందికి జాప్యం జరుగుతోందని, అది సరైన విధానం కాదని తెలిపారు. వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ తాగునీరు పూర్తిస్థాయిలో అందేందుకు ఫిల్టర్ బెడ్లు అవసరమన్నారు. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సమావేశం రూ.23 లక్షల 51 వేల విలువైన పలు పనులకు ఆమోదం తెలిపింది. వీటితోపాటు ఆదాయం చేకూర్చే వేలం పాటలకు కూడా అనుమతించింది. సమావేశంలో కమిషనర్ కృష్ణమోహన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ హైమావతి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి నరసాపురం ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నాయకర్ మాట్లాడారు. రానున్న పండుగ దృష్ట్యా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు తదితర వాటిని మెరుగు పరచాలని అన్నారు. పందులు, పశువులు, కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో సంచరించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మెప్మా అధికారి దాడి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ శ్రీ వెంకటరమణ, వైస్ ఛైర్ పర్సన్ నాగిని, కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్ బొమ్మిడి సూర్యకుమారి పాల్గొన్నారు.

12న స్వర్ణోత్సవాలకు తరలిరావాలి

ఆకివీడు : వచ్చే నెల 12వ తేదీన జరగనున్న కళాశాల స్వర్ణోత్సవాలకు పూర్వ విద్యార్థులు, అభిమానులు, నాటికళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు, నాటి సిబ్బంది ప్రతి ఒక్కరూ తరలిరావాలని పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం విజ్ఞప్తి చేసింది. సంఘం కార్యవర్గ సమావేశం సోమవారం సాయంత్రం కళాశాల కార్యాలయంలో జరిగింది. కార్యవర్గ అధ్యక్షులు గొంట్ల కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సుమారు 20 మంది సభ్యులు పాల్గొన్నారు. స్వర్ణోత్సవాల నిర్వహణ తీరు తెన్నులు, తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశాలకు కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి బాపిరాజు, పలువురు ప్రజాప్రతినిధులు తదితర ప్రముఖులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నేరెళ్ల చెంచయ్య, చింతలపాటి సీతారామరాజు, గుర్రం ఈశ్వరరావు, కాకర్ల రాజరాజేశ్వరి, సిహెచ్ శ్రీనివాస్, కళాశాల లెక్చరర్ ఓగేశ్వరరావు పాల్గొన్నారు.

నక్కావారిపాలెంలో ఆకుమడుల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆకుమడులు నీట మునిగిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. సోమవారం మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆకుమడుల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఆకుమడుల్లో నీరు చేరిన మడులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆకుమడుల్లో నీరు నిలిచిపోతే ఎప్పకప్పుడు బయటకు తోడాలన్నారు. ప్రస్తుత వాతావరణంలో ఆకు ఎదుగుదల తక్కువగా ఉంటోందని, ఎక్కువ రోజులు నీరు నిలిచి ఉంటే 5 సెంట్ల ఆకుమడులకు 2 కేజీల మ్యూరేట్ ఆఫ్ పోటాష్‌ను వేయాలన్నారు. ముదురు ఆకుతో నాట్లు వేసుకుంటే దిగుబడులు సాధించొచ్చున్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

కాళ్ల : బాలోత్సవం ముగింపు కార్యక్రమంలో కోపల్లె హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని ఐక్య నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షులు వై.శ్రీనివాసఆచారి సోమవారం తెలిపారు. భీమవరంలో జరిగిన బాలోత్సవంలో బహుమతులు సాధించిన విద్యార్థులకు ఎంఆర్.రాజు సర్టిఫికెట్లు మెమెంటోలు అందజేశారు. నేటి విద్యార్థులను చూసి దేశం గర్వపడేలా ఎదగాలని భారతరత్న అవార్డు గ్రహీత ఎంఆర్ రాజు విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ రాజు, సర్వోదయ మండలి కెబివి.మురళీకృష్ణ, బాలోత్సవ కమిటీ సభ్యులు ధనుష్, గణేష్, ఎస్ఎండిఆర్ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోపల్లె విద్యార్థులు, శశి మెరిట్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : భీమవరంలోని చింతలపాటి బాపిరాజు హైస్కూల్లో నిర్వహించిన బాలోత్సవంలో తమ విద్యార్థులు అనేక ప్రదర్శనల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ లైన్ కృష్ణంరాజు అన్నారు. సోమవారం స్కూల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. బాలోత్సవం సంబరాల్లో తమ విద్యార్థులు వ్యాసరచన, చిత్రలేఖనం, పద్యం భావం చెప్పడం, కోలాటం, డాన్స్, శాస్త్రీయ నిత్యాలు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు.. కార్యక్రమంలో సుధ, సత్యనారాయణ పాల్గొన్నారు.